క్లుప్తంగా

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి



అచ్చంపేట రూరల్: జిల్లాలోని మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా మత్స్యశాఖ అధికారిణి రజని అన్నారు. శనివారం మండలంలోని చంద్రసాగర్ చేపల ఉత్పత్తి కేంద్రం వద్ద చేపల పెంపకాన్ని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్లు, మత్స్యకారులతో కలిసి ప్రారంభించారు. హౌజ్‌లోనికి బంగారు తీగ రకం ఆడ చేపను వదిలారు. సెప్టెంబర్ 15 నుంచి చేప పిల్లలను పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో 235 సొసైటీలు ఉండగా.. 17,800 మంది సభ్యులు, 1,056 చెరువులు ఉన్నాయన్నారు. సుమారుగా 2.58కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయనున్నామన్నారు. జిల్లాలో 6 కొత్త చెరువులను గుర్తించామన్నారు. ఇప్పటికే 18 కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించామన్నారు.

సబ్సిడీపై యాంత్రీకరణ పరికరాలు

బల్మూర్: వ్యవసాయ యాంత్రీకరణ సబ్‌మిషన్ (స్మామ్) పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ సన్న, చిన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందించనున్నట్లు మండల వ్యవసాయాధికారి కావేటి నరేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాటరీ చేతిపంపులు, పవర్ ఆపరేటివ్ స్ప్రేయర్లు, రోటవేటర్స్, బ్రష్ కట్టర్, కల్టివేటర్, కేజీ వీల్స్ కావాల్సిన వారు దరఖాస్తు చేసుకుకోవాలని కోరారు. దరఖాస్తుదారులు అప్లికేషన్ ఫారంతో పాటు పట్టాదారు పాసుబుక్, ఆధార్, ట్రాక్టర్ ఆర్సీ జిరాక్స్ కాపీలను అందించాలని సూచించారు.

నోట్‌బుక్స్ పంపిణీ

బల్మూర్: మండలంలోని అనంతవరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రూ.30 వేల విలువ గల నోట్‌బుక్స్, స్టేషనరీని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యా స్వేచ్ఛ ఫౌండేషన్ చైర్మన్ వాసుదేవ్ మాట్లాడుతూ.. గ్రామీణ పేద విద్యార్థులకు చేయూత అందించేందుకు తమ ఫౌండేషన్ వివిధ కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మహేశ త్రిలోక్, ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వర్, ఉపాధ్యాయులు గౌతమి, రవీందర్, ఉన్నారు.

పత్తి లో సస్యరక్షణ చర్యలు

చారకొండ: ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంటకు తెగుళ్లు ఆశించాయని, సంరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈఓ వంశీ అన్నారు. మండలంలోని సిర్సనగండ్ల క్లస్టర్‌లో శనివారం ఏఈఓ క్షేత్రస్థాయిలో పత్తి పంటలను పరిశీలించారు. పత్తి పంటకు తామర పురుగు, పేను బంక, తెల్ల, పచ్చదోమ అధికంగా ఉన్నట్లు గుర్తించి, నివారణకు తగు సూచనలు చేశారు.

చేగుంటలో ఉట్ల పండుగ

తిమ్మాజిపేట: మండలంలోని చేగుంటలో శనివారం రాత్రి ఉట్ల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో చేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు ఉట్లు కొట్టారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

ఉప్పునుంతల: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం సాగిస్తుందని తపస్ జిల్లా నాయకులు కట్టా ప్రభాకర్‌రెడ్డి, కట్టా మల్లారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పాఠశాలల్లో చేపట్టిన తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్, చంద్రశేఖర్, సభ్యులు మహేష్, బుచ్చయ్య, రాజు, హనుమంతు, శంకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులు పున:ప్రారంభం



లింగాల: మండల కేంద్రం సమీపంలోని చిన్న వాగుపై అర్థాంతరంగా నిలిచిపోయిన వంతెన నిర్మాణం పనులు శనివారం పున:ప్రారంభమయ్యాయి. ఈ మార్గంలో వర్షాలకు వాగు ఉధృతంగా పారడంతో కొన్ని రోజుల పాటు అప్పాయపల్లి, శ్రీరంగాపూర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా.. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు శుక్రవారం వంతెనను పరిశీలించి, పనులు ప్రారంభించారు.

ప్రయాణికులకు అన్నప్రసాదం పంపిణీ

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అమావాస్య సందర్భంగా శనివారం ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో అన్నప్రసాదం పంపిణీ చేశారు. దాదాపు 600 మంది ప్రయాణికులకు అన్నం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, శేఖర్, ముత్యాలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా రోడ్లు

- గుంతల రోడ్లపై ప్రయాణం నరకయాతన
- ఏళ్ల తరబడిగా నిర్వహణకు నోచుకోని వైనం
- కంకర పరిచి బీటీ మరిచిన అధికారులు



ఉప్పునుంతల నుంచి కొత్తరాంనగర్ వెళ్లే మట్టి రోడ్డు దుస్థితి

ఉప్పునుంతల: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో మట్టి రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అడుగడున గుంతలు ఏర్పడి బురదగుంటలుగా మారడంతో రోడ్లపై వెళ్లడానికి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలను కలుపుతూ ఉన్న మట్టి రోడ్లకు కొన్నేళ్లుగా మరమ్మతు చేపట్టకపోవడంతో గుంతల్లో నీరు నీరు చేరి అంచులు కోతకు గురయ్యాయి.ఇరువైపులా చెట్లు కమ్ముకొని పూర్వం ఉన్న బండ్ల డొంకలను తలిపిస్తున్నాయి.

మట్టి రోడ్లు మరింత అధ్వానం..

ఉప్పునుంతల మండల కేంద్రం నుంచి కొత్తరాంనగర్ వరకు ఉన్న మట్టి రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది. ఇరువైపులా రైతులు రోడ్డుకు దగ్గరగా దున్నడంతో బండ్ల డొంకగా మారింది. దాంతోపాటు ఈ రోడ్డు నల్లచెరువు కట్టపై ఉండటంతో మరింత ప్రమాదకరంగా మారింది. కొన్ని చోట్ల రోడ్డుపై వెళ్లడానికి వీలుగాక పక్క వెంట పొలాల గుండా రాకపోకలు సాగిస్తున్నారు. అదేవిధంగా మండల కేంద్రం నుంచి పెద్ద చెరువుకట్ట మీదుగా ఉన్న మట్టి రోడ్డు పరిస్థితి ఆధ్వానంగా ఉంది. రోడ్డుపై ఒక్కొర్లు ఏర్పడటంతో వాహనదారులు, రైతులు ప్రతినిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- గట్టుతుమ్మెన్–మర్రిపల్లి వరకు ఉన్న రోడ్డు కొన్నేళ్ల క్రితం మెటల్ చేసి తిరిగి పట్టించుకోకపోవడంతో కంకర తేలి రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి.
- కొరటికల్ పీడబ్ల్యూ రోడ్డు నుంచి వెల్టూరు వరకు ఉన్న మట్టి రోడ్డు, తిర్మలాపూర్ నుంచి జప్తీ సదగోడు వరకు ఉన్న మట్టి రోడ్డు,పెద్దాపూర్ నుంచి చిలుకల వాగు మీదుగా దాసర్లపల్లి వరకు ఉన్న మట్టి రోడ్డు పూర్తి దెబ్బతిని కోతలకు గురైంది.
- ఉప్పునుంతల నుంచి అచ్చంపేట మండలం పల్కపల్లి వరకు ఉన్న మట్టి రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా ఉంది.
- ఉప్పునుంతల నుంచి పెద్దాపూర్, ఉప్పునుంతల నుంచి మొల్గర, మర్రిపల్లి నుంచి లక్ష్మాపూర్ వరకు ఉన్న మెటల్ రోడ్డు నిర్వహణ పట్టించుకోకపోవడంతో రోడ్డుపై వేసిన కంకర పూర్తిగా తొలగిపోయి వాహనాలు వెళ్లడానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది.

పేరుకు మాత్రమే బీటీ రోడ్లు..

మండల కేంద్రం నుంచి మొల్గర, మామిళ్లపల్లి మీదుగా రాకొండ వరకు ఏన్నో ఏళ్ల కిందట వేసి బీటీ సింగిల్ రోడ్డు అక్కడక్కడ కోతకు గురై ప్రమాదభరితంగా ఉంది. మామిళ్లపల్లి నుంచి దాసర్లపల్లి వెళ్లే మార్గంలో బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై గోతులు పడింది. తాడురు నుంచి ఉప్పునుంతల మండల కేంద్రం వరకు ఉన్న బీటీ రోడ్డు దెబ్బతిని వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా తయారైంది. పెనిమిళ్ల, సీబీ తండా, పూర్యానాయక్ తండాలకు ఉన్న బీటీ రోడ్లకు కొన్నేళ్లుగా నిర్వహణ లేక పూర్తిగా ధ్వంసమయ్యాయి.

రోడ్డుపై బైకులు వెళ్లే పరిస్థితి లేదు..



మండల కేంద్రం నుంచి కొత్తరాంనగర్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా గోతులు పడి బురద కావడంతో బైక్‌లు వెళ్లడానికి కూడా ఇబ్బందిగా ఉంది. కనీసం అత్యవసర సమయంలో ఆటోలు,అంబులెన్స్‌లు రాని పరిస్థితి ఉంది.వర్షానికి ముందు రోడ్డుపై అక్కడక్కడ మట్టిని పోయడంతో అది బురదగా మారి మరింత అధ్వానంగా తయారైంది. ఎన్నో ఏళ్ల నుంచి రోడ్డు సమస్యతో ఇబ్బందిపడుతున్నా పట్టించుకునే వారు లేరు.

– పుట్ట లక్ష్మయ్య, కొత్తరాంనగర్

బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు

ఇటీవల వర్షాలకు వరదనీరు రోడ్డుపై పొంగిపొర్లి రాకపోకలకు అంతరాయం కల్గిన కాంసానిపల్లి నుంచి కాంసానిపల్లితండాకు వెళ్లే రోడ్డు మార్గంలో చీకటి వాగు వద్ద, మామిళ్లపల్లి నుంచి దాసర్లపల్లి వెళ్లే రోడ్డు మార్గంలో చిలుకల వాగు వద్ద బ్రిడ్జిల నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపించాం. మట్టి రోడ్లు, ఇతర మెటల్ రోడ్ల అభివృద్ధి కోసం ఉన్నతాధికారుల నుంచి ప్రతిపాదనలు అడిగితే వెంటనే పంపించడానికి సిద్ధంగా ఉన్నాం.

– మహేష్, పీఆర్ ఏఈ, ఉప్పునుంతల

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ఎజెండా

నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమమే ముఖ్యమని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలకపల్లి, తిమ్మాజీపేట, తాడూర్ మండలాలకు సంబంధించిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత అధికారులదేనన్నారు.

జీపీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన

తాడూరు: మండలంలోని గుంతకోడూరు, వెంకటపూర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించే పంచాయతీలకు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, ఎంపీడీఓ అంజనేయులు, తహసీల్దార్ జయంతి, ఎంపీఓ నర్సింహులు, డీఆర్ గోవిందు, రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు

ప్రతి విద్యార్థి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

కందనూలు: ప్రతి విద్యార్థి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో గల ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. కూచకుళ్ల ఫౌండేషన్ ద్వారా కళాశాలకు 15 గ్రీన్ బోర్డులు అందించారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగారుబాబు ఆధ్వర్యంలో నాయకులు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ఏబీవీపీ నాయకులు ప్రసాద్‌కుమార్, రమేష్, మల్లేష్‌యాదవ్, శివ, భరత్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

వెల్గొండ మోడల్ విలేజ్‌గా మారాలి

బిజినేపల్లి: అభివృద్ధిలో వెల్గొండ ఒక మోడల్ విలేజ్‌గా మారాలని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ఆకాంక్షించారు. శనివారం మండలంలోని వెల్గొండలో నూతన గ్రామ పంచాయతీ భవనం, పల్లె దవాఖానా భవనాలను ప్రారంభించారు. సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటదాస్, ఎంపీడీఓ కతలప్ప, వైద్యాధికారి డా.శివకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడి దాతృత్వం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని విద్యానగర్ ఒకటో వార్డు పరిధిలో కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి బీజేపీ నాయకుడు రాంభూపాల్‌రెడ్డి ముందుకు వచ్చి దాతృత్వం చాటుకున్నారు. కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షాలకు ఆ కాలనీ నీట మునిగింది. డ్రైనేజీ సమస్య, సీసీ రోడ్లు నిర్మించేందుకు స్థలం లేకపోవడంతో పాటు విపరీతంగా చెట్లు పెరిగి విష కీటకాలకు నిలయంగా మారింది. ఆ ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ సందర్శించిన సందర్భంలో సమస్య పరిష్కారానికి దాదాపు రూ.50 లక్షల విలువైన తన స్థలాన్ని ఇస్తానని రాంభూపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

ఉప్పునుంతల: స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతరిక్ష పరిశోధనలపై పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు వెంకటేష్, సంగీత, చందన విద్యార్థులకు వివరించారు. బాటిల్ రాకెట్ ప్రయోగం ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు.

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం

అచ్చంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది కూరగాయల మార్కెట్‌లో శనివారం సింగిల్ యూస్ ప్లాస్టిక్‌పై ప్రచారం నిర్వహించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గణేష్, వార్డ్ ఆఫీసర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చెస్ బోర్డులు పంపిణీ

కందనూలు: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌ఆర్‌ఐ ఫోరం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి చేతుల మీదుగా చెస్ బోర్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాలమూరు ఎన్‌ఆర్‌ఐ కన్వీనర్ రవిప్రకాష్ రెడ్డి, రమేష్‌రెడ్డి, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లత, ఉపాధ్యాయులు దొడ్ల సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఆర్‌ఐడీ పూర్వ విద్యార్థులు, పాలమూరు ఎన్నారై ఫోరం సభ్యులు సంయుక్తంగా పట్టణంలోని ఆర్‌ఐడీ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, పీఈటీలకు చెస్ బోర్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఇమ్మానుయేల్, రవిప్రకాష్, రమేష్‌రెడ్డి, మదన్ మోహన్‌రావు, విమల, శ్రీకాంత్ ఉన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

సాక్షి, నెట్‌వర్క్: సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పీఆర్టీయూ, తపస్ ఆధ్వర్యంలో శనివారం జిల్లావ్యాప్తంగా ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏఓ చేంద్రశేఖర్, అన్ని మండలాల తహసీల్దార్లకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మనెమోని శేఖర్, సీపీఎస్ ఉద్యోగుల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి పాల్గొన్నారు.



నేడు మంత్రి సీతక్క పర్యటన

అమ్రాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ఆదివారం అమ్రాబాద్ మండలంలో పర్యటించనున్నారు. ఉపాధి హామీ పథకం పనుల జాతరలో భాగంగా తుర్కపల్లి, కల్ములోనిపల్లి,జంగంరెడ్డిపల్లి గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవనాలు,మొల్కమామిడిలో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి మంత్రి సీతక్క శంకుస్థాపనలు చేస్తారని ఎంపీడీఓ లింగయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోస్టర్ విడుదల

అమ్రాబాద్: సీపీఎస్‌ను రద్దు చేయాలని పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నిర్వహించనున్న మహాధర్నా వాల్‌పోస్టర్‌ను శనివారం పదర జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో నాయకులు అవిష్కరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు నిరంజన్, నాయకులు లక్ష్మణ్, గోపాల్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షకు బీసీ శ్రేణులు తరలిరండి

కందనూలు/కల్వకుర్తి రూరల్: హైదరాబాద్‌లో ఇందిరా పార్క్ వద్ద సోమవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేపట్టే సత్యాగ్రహ దీక్షకు బీసీలు భారీగా తరలి రావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

కొల్లాపూర్: రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఇచ్చే ఉచిత కంప్యూటర్ శిక్షణ కోసం ఆసక్తి గలవారు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ సూచించారు. ఎంఎస్ ఆఫీస్, డీటీపీ కోర్సులకు సంబంధించిన శిక్షణ తరగతులు సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 91770 50558 ను సంప్రదించాలని సూచించారు.

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి సీపీఐ తీరని లోటు



సాక్షి, నెట్‌వర్క్: పేదల పెన్నిధి, సీపీఐ జాతీయ నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు వార్ల వెంకటయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సూర్యశంకర్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లావ్యాప్తంగా సీపీఐ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో నాయకులు సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. కేశవులగౌడ్, పెరుముల గోపాల్, అంజనేయులు, మహబుబ్ అలీ పాల్గొన్నారు.

సీసీ పనులు ప్రారంభం

అమ్రాబాద్: మండల కేంద్రంలోని జామె మసీదు ఆవరణలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ నిధులు రూ.10లక్షలతో సీసీ నిర్మాణ పనులు చేపట్టినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరినారాయణగౌడ్, ముస్లిం మండల కమిటీ అధ్యక్షుడు దస్తగిర్ తదితరులు తెలిపారు.

ఎల్‌ఓసీ చెక్కు పంపిణీ

వెల్దండ: మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన ఎగిరిశెట్టి క్రిషిక కాలు ప్రమాదవశాత్తు విరగడంతో వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.90వేల చెక్కును కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అందజేశారు.

ఆరు గ్యారంటీల అమలులో నిర్లక్ష్యం

అచ్చంపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వేగంగా అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ భారతీయ జనతా పార్టీ అచ్చంపేట మండల నాయకులు తహసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతినెల రూ.2,500, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా ద్వారా ఎకరానికి రూ.15వేలు అని చెప్పి రూ.12వేలకు కుదించి అన్నదాతలను మోసం చేశారని దుయ్యబట్టారు. రూ.2లక్షల రుణ మాఫీ, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులకు రూ.12 వేలు పథకం అసంపూర్తిగానే మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. యాసంగిలో కొనుగోలు చేసిన సన్నాలకు ఇంత వరకు రూ.500 బోనస్ చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు కాత్రావత్ జ్యోతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మోక్తాల రేనయ్య, జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అఖిల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పొలం ఆంజనేయులు, నోముల బాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో చండీహోమం



తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి గుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులతో ఆలయ పూజారి గంగాధరశర్మ శనివారం చండీహోమం నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకొని భక్తులు స్వామివారి ఆలయం గిరి ప్రదక్షిణ చేశారు. భక్తులకు అప్పాజిపల్లికి చెందిన చిలుక దివ్య, వివేక్‌రెడ్డి దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. కోడుపర్తి గ్రామానికి చెందిన సౌజన్య, బాల్‌రెడ్డి దంపతులు ఆలయ అభివృద్ధికి రూ.10,116 దేవస్థాన కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రాంచంద్రారెడ్డి, సురేందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం



కల్వకుర్తి టౌన్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని మాజీ కౌన్సిలర్ మంజుల అన్నారు. శనివారం పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో వినాయకచవితి సందర్భంగా మట్టి వినాయకలను ఉచితంగా కాలనీవాసులకు అందజేశారు. ప్రతి ఏటా ఉచిత మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నామని, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మధు, జీవబ్రహ్మం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద యువతికి చేయూత

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన నిరుపేద యువతి మహేశ్వరి వివాహానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రూ.10వేలు శనివారం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గణేష్, శేఖర్, శ్రీను, ఝాన్సీ, గంగ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరులకు అండగా ఉంటా

మన్ననూర్: గొర్రెల కాపరులు నల్లమల అభయారణ్యంలో శుక్రవారం అర్ధరాత్రి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను కలిసి తమ బాధలు విన్నవించుకున్నారు. ఈ క్రమంలో వారికి అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వివరాల ప్రకారం .. పలు అభివృద్ధి పనులలను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే అమ్రాబాద్ మండలంలోని కృష్ణగిరి (ఈగలపెంట), పాతాలగంగకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉండగా శ్రీశైలం, హైదరాబాద్ ప్రధాన రహదారిలోని అటవీ లోతట్టు ప్రాంతంలో గొర్రెల కాపరులు రోడ్డు పక్కగా ఎదురు చూడటాన్ని గమనించిన ఆయన కారు దిగి వారితో మాట్లాడారు. వర్షాకాలంలో సమయంలో తమ ప్రాంతంలో గొర్రెలకు మేత లేకపోవడంతో కొన్ని దశాబ్దాలుగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతి ఏట గొర్రెలను మేపుకోవడానికి తరచుగా నల్లమలకు వస్తుంటామని గొర్రెల కాపరులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ క్రమంలో అటవీశాఖ అధికారులు అటవీ నిబంధనల పేరుతో గొర్రెలను ఇక్కడి నుంచి మైదాన ప్రాంతాలకు తరలించుకుపోవాలని తీవ్ర ఇబ్బందులు పెట్టడంతో పాటు కొన్ని సమయాల్లో దాడులు చేస్తున్నారని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే అండగా ఉండటంతో పాటూ వచ్చే దీపావళి పండగ వరకు అటవీశాఖ వారు మిమ్మల్ని ఇబ్బందులకు గురి చేయకుండా చూస్తానని హామీ ఇచ్చారు.



రామచంద్రారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

బాధిత కుటుంబానికి పరామర్శ

ఉప్పునుంతల: సీఎం రేవంత్‌రెడ్డికి పీఏగా పనిచేస్తున్న మండలంలోని తిర్మలాపూర్‌కు చెందిన వెల్దండ జైపాల్‌రెడ్డి తండ్రి రాంచంద్రారెడ్డి అనారోగ్యంతో శుక్రవారం రాత్రి చనిపోయాడు. ఈ మేరకు శనివారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మైనంపల్లి హన్మంతరావు, వ్యవసాయ కమీషన్ సభ్యులు కేవీఎన్‌రెడ్డి, విద్యా కమీషన్ సభ్యులు చారగొండ వెంకటేష్, సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్ గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళ్లర్పించారు. జైపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నర్సింహారెడ్డి, అనంతరెడ్డి, అనంతప్రతాప్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఉపకరణాలతో బోధన సులభతరం



టీఎల్‌ఎంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

చారకొండ: బోధనోపకరణాలతో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభంగా బోధన చేసే అవకాశం ఉందని తహసీల్దార్ సునీత అన్నారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం మండల స్థాయి టీఎల్‌ఎం మేళా నిర్వహించగా.. ఎంపీడీఓ శంకర్‌నాయక్‌తో కలిసి తహసీల్దార్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేళాలో మండలంలోని ఉపాధ్యాయులు తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టుల వారీగా బోధనకు సంబంధిత ఉపకరణాలను తయారు చేసి మేళాలో ప్రదర్శించారు. మండలంలోని 16 పాఠశాల నుంచి 40 మంది ఉపాధ్యాయులు మేళాలో పాల్గొన్నారని ఎంఈఓ ఝాన్సీరాణి తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు భగవాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు కమలాకర్‌రావు, మహిపాల్‌నాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

కల్వకుర్తి టౌన్: సీహెచ్‌సీకి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీసీ) సమావేశంలో డీసీహెచ్‌ఎస్ రామకృష్ణతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి నిత్యం వస్తున్న రోగుల సంఖ్య, వారికి అందిస్తున్న సేవలు, ఇన్‌పేషెంట్ల వివరాలను అక్కడి వైద్యాధికారులతో తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగుల కోసం నూతనంగా రూ.2.8 లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భీమానాయక్, సీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి

రక్తదానంతో మరొకరి ప్రాణాలు కాపాడే ప్రాణదాతలు కావాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం ప్రజాహిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ప్రపంచ సోదర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రక్తదాన శిబిరంలో ఇచ్చే ప్రతి రక్తపు చుక్క ఆపద కాలంలో మరొకరి ప్రాణాలు కాపాడేందుకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం 20 యూనిట్ల రక్తాన్ని సేకరించగా, దాతలకు సర్టిఫికెట్లు అందించారు.



రక్తదానం చేసిన యువకులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

వెల్దండ: హిందూ ధర్మాన్ని, సమాజాన్ని పరిరక్షించడం అందరి బాధ్యతని పాలమూరు విభాగ్ శారీరక్ ప్రముఖ్ భోగ రాజు రాము పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వయం సేవకుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని విచ్ఛిన్నం చేసేందుకు విద్రోహశక్తులు కుట్రలు పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందన్నారు. హిందూ సమాజ పరిరక్షణలో ఎంతోమంది స్వయం సేవకులు ప్రాణాలను కోల్పోయారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార్యవహ సంగిశెట్టి చంద్రశేఖర్, ఖండ కార్యవాహ శోభన్‌బాబుచారి, వేణుగోపాల్‌చారి, రాజ్‌కుమార్, మాజీ ఎంపీటీసీలు చిందం కృష్ణయ్య, జంగయ్య, చక్రవర్తిగౌడ్, నాయకులు విజేందర్‌రెడ్డి, తాటికొండ కృష్ణారెడ్డి, యాదగిరి, వరప్రసాద్‌రెడ్డి, సంతోష్‌చారి తదితరులు ఉన్నారు.



వందనం చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ సేవకులు